

ప్రభుత్వం కట్టుబడి ఉంది
సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. - 8లో



వర్గీకరణను అడ్డుకుంటాం
ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అన్నారు. - 8లో



బీసీ రిజర్వేషన్లు పెంచాలి
బీసీల రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. - 8లో

న్యూస్‌రీల్

కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట: కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరమని డీఎంహెచ్‌ఓ కోటాచలం అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఆరోగ్య కార్యకర్తలతో కుటుంబ నియంత్రణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 4వ వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మగవారికి కుట్టు, కోత లేకుండా వెసెక్టమీ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీ నుంచి కనీసం ఐదు కేసులను తగ్గకుండా ఆపరేషన్లకు తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, అనితరాణి, నాజియా, స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరయ్య, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ మత్స్యగిరి, డీపీఓ ఉమా తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

చిలుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్నకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం చిలుకూరు సీపీఐ భవన్‌లో జరిగిన ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిలక రాజు, చేపూరి కొండలు, మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు, నాయకులు శ్యామ్ సుందర్, వీరయ్య, ఫయాజ్, సందీప్, లింగరాజు, భరత్, మహేష్, సైదులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

నాగారం: యాసంగి సీజన్‌లో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నాగారం మండలం నాగారంబంగ్లాలో ఫెర్టిలైజర్, ఫెర్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేయడంతోపాటు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఏపీని ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. డీలర్లు విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బాలకృష్ణ, ఏఓ కృష్ణకాంత్ ఉన్నారు.

కబ్జాల నిగ్గు తేల్చాల్సిందే

కోదాడ పెద్దచెరువు ఆక్రమణలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం



కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు శిఖంలో వెలసిన నిర్మాణాలు

- రిజ్వీ నివేదిక ఆధారంగా ఆక్రమణలు ఎందుకు తొలగించలేదని ఆగ్రహం
- మరోసారి సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం
- సర్వే చేయాలని అధికారులకు కలెక్టర్ ఉత్తర్వులు

కోదాడ: ఆక్రమణలకు గురవుతున్న కోదాడ పెద్ద చెరువు వ్యవహారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) వరకు వెళ్లింది. చెరువు ఆక్రమణలపై 2010లో అప్పటి ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్ సయ్యద్ ముర్తుజా రిజ్వీ చేయించిన సర్వే ఆధారంగా ఆక్రమణలు తొలగించలేదని కొందరు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్‌జీటీ పూర్తిస్థాయిలో కోదాడ పెద్దచెరువును సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో జిల్లా అదనపు కలెక్టర్, కోదాడ ఆర్డీఓ ఆధ్వర్యంలో చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది.

అసలేం జరిగిందంటే..

కోదాడ పట్టణానికి ఉత్తర దిక్కున 720 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉంది. పట్టణానికి సమీపంలో ఉండడంతో చెరువు ఆక్రమణ యథేచ్ఛగా సాగింది. చెరువుకు మూడు వైపులా పలువురు ఆక్రమించి రకరకాల పట్టాలు చేయించుకున్నారు. ఇంతటితో ఆగకుండా కొందరు అమ్మకాలు చేశారు. మరికొందరు లోతట్టును పూడ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇంకొందరు చెరువు శిఖంలో వెంచర్లను ఏర్పాటు చేశారు. దీంతో కోదాడ పెద్ద చెరువు ప్రస్తుతం 450 ఎకరాల విస్తీర్ణానికి తగ్గింది. ఆక్రమణలపై పలు ఫిర్యాదులు రావడంతో 2010లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ రిజ్వీ చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేయించి, రిపోర్టు తయారు చేయించారు. చెరువు హద్దులను నిర్ణయించే పెగ్ మార్కులను కూడా వేయించారు. ఈ రిపోర్టులో ఆక్రమణలను గుర్తించడంతో పాటు వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించే లోపే ఆయన బదిలీపై వెళ్లారు. దీంతో ఆ నివేదికను అధికారులు బుట్టదాఖలు చేశారు. దీనిపై కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ట్రిబ్యునల్ ఆదేశాలతో అధికారుల్లో మళ్లీ కదలిక వచ్చింది.

నాడు గుర్తించిన ఆక్రమణలు ఇవే..

రిజ్వీ రిపోర్టులో రామిరెడ్డిపాలెం వైపు 26 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అలాగే పట్టణం వైపు ఇండోర్ సబ్‌స్టేషన్ ప్రాంతం, సూర్యాపేట రోడ్డులోని పెట్రోల్ బంక్ వెనుకభాగం, రామ్మూర్తి నగర్‌లోని మున్సిపాలిటీ బావి, ఇండోర్ స్టేడియం, ఇదే ప్రాంతంలో ఉన్న పాఠశాల, మరో రెండు అపార్ట్‌మెంట్లు, ఒక ఫంక్షన్ హాల్, జూనియర్ కళాశాల, మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య ఇంటి వెనుకభాగం, దీనికి సమీపంలో ఉన్న మరో భవనం, ఓ పార్టీ కార్యాలయం నిర్మించి ఉన్న ప్రాంతమంతా చెరువు శిఖ భూమేనని అధికారులు తేల్చారు. సాయికృష్ణ థియేటర్ సమీపంలోని ఓ పాఠశాల, కొన్ని భవనాలు, రాఘవాపురం వైపు ఉన్న నూతన పబ్లిక్ క్లబ్ భవనం, వెంకట్రాంపురం వైపు 54 ఎకరాల వ్యవసాయ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇది 2010 వరకు ఉన్న ఆక్రమణల జాబితా. అప్పటి నుంచి 2024 వరకు పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. తాజా సర్వేలో ఇవన్నీ బయటపడే అవకాశం ఉంది.

నాలుగు రోజుల్లో సర్వే ప్రారంభిస్తాం

కోదాడ పెద్దచెరువు ఆక్రమణలపై కొందరు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో చెరువు సర్వేకు కలెక్టర్ ఆదేశించారు. నాలుగు రోజుల్లో పెద్దచెరువు సర్వే పనులు ప్రారంభిస్తాం. ఆక్రమణలు గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందిస్తాం.

– సూర్యనారాయణ, కోదాడ ఆర్డీఓ

సర్వే పారదర్శకంగా చేపట్టాలి



కోదాడ పెద్దచెరువు ఆక్రమణలపై రిజ్వీ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవాలని పదిహేనేళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవం లేదు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో త్వరలో చేపట్టబోయే సర్వే పారదర్శకంగా నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తారని భావిస్తున్నాం.

– పొదుగు హుస్సేన్, సామాజిక కార్యకర్త

ప్రజా పాలన ఉత్సవాలకు తరలిరండి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని కొండిన్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరా శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7 నాటికి ఏడాది పూర్తిచేసుకోబోతున్నందున ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌లు సభ్యులుగా నియమించిన సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు మంత్రి పర్యటన

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. హైదరాబద్‌లో ఉదయం 10.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు చింతలపాలెం చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు చింతలపాలెంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం మేళ్లచెరువు–చింతిర్యాల బీటీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 3 గంటలకు పీఆర్ సిమెంట్ ఫ్యాక్టరీ–కిష్టాపురం బీటీ రోడ్డు విస్తరణ పనులకు కిష్టాపురంలో శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు మఠంపల్లిలో మట్టపల్లి–హుజూర్‌నగర్ బీటీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5 గంటలకు హుజూర్‌నగర్‌లోని కొండిన్య ఫంక్షన్ హాల్లో జరిగే ప్రజాపాలన విజయోత్సవాల్లో మంత్రి ఉత్తమ్ పాల్గొంటారని మంత్రి పీఆర్‌ఓ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఆలయ భూముల ఆక్రమణపై విచారణ



విచారణలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన

మునగాల: మండలంలోని నర్సింహాపురంలో గల శ్రీకోదండ రామస్వామి దేవాలయ భూముల ఆక్రమణలపై గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఫిర్యాదు నేపథ్యంలో లోకాయుక్త ఆదేశాల మేరకు శనివారం పలువురు అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.అనిత, ఉమ్మడి నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన మాట్లాడుతూ దేవాలయ భూములు ఆక్రమించిన వారు వారం రోజుల్లో ఓ నిర్ణయానికి వచ్చి అప్పటించాలని, లేదంటే చట్టరీత్యా తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఫిర్యాదుదారుడు వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఆక్రమణదారుల చెర నుంచి దేవాలయ భూములను కాపాడాలని అధికారులను కోరారు. ఈ విచారణలో దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన తహసీల్దార్లు ఎస్.విజయలక్ష్మి, ఎం.హరిత, మిర్యాలగూడ, నల్లగొండకు చెందిన ఆ శాఖ ఇన్‌స్పెక్టర్లు పి.ఏడుకొండలు, బి.సుమతి, వివిధ గ్రామాలకు చెందిన ఈఓలు, మునగాల ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రవణ్‌కుమార్ తదితరులు

అర్వపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టే 3–ఎల్ ప్రోగ్రాం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్, పీడీ పి.మల్లేష్, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీదేవి, మధుకర్, విమల, ప్రసన్న, రమేష్, శ్రీరాములు, వీరన్న, స్వర్ణలత, నాగయ్య, సునంద, అంజలి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

హుజూర్‌నగర్: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సభకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని కొండిన్య ఫంక్షన్ హాల్ ఆదివారం జరిగే విజయోత్సవాల ఏర్పాట్లను శనివారం ఆయన స్థానిక అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ, భువనగిరి ఎంపీలు కుందూరి రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, మందుల సామేల్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో



హుజూర్‌నగర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

హుజూర్‌నగర్, కోదాడ ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యానారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ కత్తుల నాగేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తాం

ఇక నుంచి అన్ని విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వెల్లడించారు. శనివారం సాయంత్రం హుజూర్‌నగర్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, నాయబ్ తహసీల్దార్, ప్రిన్సిపాల్ రెహానాబేగం, అధ్యాపకులు కళ్యాణి, పుష్పరాణి, డిప్యూటీ వార్డెన్ ముబీన్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

మీలాగా కలెక్టర్ కావాలంటే ఏం చదవాలి సార్..

హుజూర్‌నగర్ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శనకు వచ్చిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఫొటోలు దిగిన అనంతరం వారితో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మీలాగా కలెక్టర్ కావాలంటే ఏం చదవాలి సార్ అని కలెక్టర్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన సావదానంగా సమాధానమిచ్చారు. డిగ్రీ మంచి మార్కులతో ఉత్తీర్ణులై, ఆ తర్వాత యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తే కలెక్టర్లు అవుతారని ఆయన చెప్పారు. ఈ పరీక్షలు రాయాలంటే స్థానిక నుంచి అంతర్జాతీయ విషయాలపై అవగాహన ఉండాలని హితబోధ చేశారు. దీంతో విద్యార్థులంతా కలెక్టర్‌కు థ్యాంక్యూ సార్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు.



మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. కొందరు శాకాహారాన్ని, మరికొందరు మాంసాహారాన్ని తీసుకుంటారు. మరి.. ఆరోగ్యానికి శాకాహారం మంచిదా? మాంసాహారం మంచిదా అనే సందేహం ఇప్పటికీ చాలా మందిలో ఉంది. మానవ శరీరానికి శాకాహారంతోపాటు మాంసాహారం ఉండాల్సిందే. మాంసాహారంతో అనేక పోషకాలు శరీరానికి లభిస్తాయి. కానీ, అతిగా తీసుకోవడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఇక శాకాహారమైతే రోజూ తినొచ్చు. శాకాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది ఆహార ప్రియులు శాకాహారం వైపే మొగ్గు చూపుతున్నారు.

– రామగిరి(నల్లగొండ)

పోషకాల సమాహారం.. శాకాహారం



- కూరగాయలు, ఆకుకూరలతో ఆరోగ్యానికి భరోసా
- మాంసాహారంలో లభించే పోషకాలన్నీ శాకాహారంలోనూ లభ్యం
- అతిగా మాంసాహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలు
- ప్రస్తుతం శాకాహారులుగా మారుతున్న ఆహారప్రియులు

సండే స్పెషల్

ప్రతి జీవికి ఆహారం అవసరం. అందులో శాకాహారమా.. మాంసాహారమా.. ఏది తీసుకుంటే మంచిదని అడిగితే.. వైద్య నిపుణులు మాత్రం శాకాహారం వైపే మొగ్గు చూపుతున్నారు. మాంసాహారం నుంచి లభించే ఏదైనా ప్రొటీన్, మినరల్స్ అన్నీ శాకాహారం నుంచి కూడా పొందవచ్చు. ఇందులో ముఖ్యంగా పప్పు, పాలు, జున్ను, పచ్చి కూరగాయలు మొదలైన వాటి నుంచి శరీరానికి కావాల్సిన అన్ని ప్రొటీన్స్, మినరల్స్ అందుతాయి. అమైనో ఆమ్లాలు శాకాహారం నుంచి లభిస్తాయి. ఈ ఆమ్లాన్ని పొందడం ద్వారా.. శరీరం దాని నుంచి అవసరమైన మొత్తంలో ప్రొటీన్‌ను తయారు చేస్తుంది. శాకాహార భోజనంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీనివల్ల మన పేగులు శుభ్రంగా ఉంటాయి. శుభ్రమైన పేగు అనేక రకాల వ్యాధులను దూరంగా ఉంచుతుంది. మాంసాహారంతో పోల్చితే శాకాహారం త్వరగా జీర్ణమవుతుంది. నాన్–వెజ్‌లో ఉండే అరాకిడోనిక్ యాసిడ్ మూడ్‌ను డిస్టర్బ్ చేస్తుందట. మాంసం, చేపలు, గుడ్లను దూరం పెడితే మూడ్ బాగుంటుందని బెనెడిక్టైన్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది.



శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యానులు (ఫైల్)

అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవం


ఏటా అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవంగా జరుపుకుంటారు. దీని ముఖ్య ఉద్దేశం శాకాహారాన్ని ప్రోత్సహించడం, శాకాహార జీవనశైలిపై అవగాహన కల్పించడం. 1977లో వెజిటేరియన్ సొసైటీ ఆఫ్ నార్త్ అమెరికా మొదటిసారిగా శాకాహార దినోత్సవాన్ని జరుపుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను శాకాహారం తినేలా ప్రేరేపించడమే దీని ప్రధాన లక్ష్యం. శాకాహారం తినడం వల్ల కలిగే లాభాలు తెలియక చాలా మంది వాటికి దూరంగా ఉంటున్నారు.

శాకాహారంతో ప్రయోజనాలు



- శాకాహారం ఆయుష్షును పెంచుతుంది. కూరగాయల్లో ఫైబర్, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ శరీరానికి కావాల్సిన మోతాదులో ఉంటాయి.
- శాకాహారం తీసుకోవడం వల్ల బీపీ కంట్రోల్‌గా ఉంటుంది. కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది.
- వెజిటేరియన్ ఫుడ్ తీసుకోవడం వల్ల మధుమేహం రావడానికి అవకాశం చాలా తక్కువ.
- అధిక బరువును నియంత్రించవచ్చు.
- కూరగాయల వల్ల అనారోగ్య సమస్యలు రావు.
- ఆకుకూరలు రక్తహీనతను అరికడతాయి. నీరసం, అలసట తగ్గిస్తాయి.
- మొలకెత్తిన గింజల నుంచి ప్రొటీన్లు, ఇతర పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.
- ఆకలి పెరుగుతుంది. మలబద్ధకం వంటి సమస్యలు రావు.
- శాఖాహారం త్వరగా జీర్ణమవుతుంది.


మాంసాహారంతో అనర్థాలు ఎక్కువ



మాంసాహారం తీసుకోవడం వల్ల అనర్థాలు ఎక్కువ కలుగుతాయి. ముఖ్యంగా జీర్ణసంబంధ సమస్యలు వస్తాయి. ఏటా శాకాహారంపై అవగాహన కలిగిస్తూ అనేక కార్యక్రమాలు చేపడతాం. శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి చేరవేస్తున్నాం.

– బి.జగదీశ్‌రెడ్డి, శ్రీ సద్గురు సదానంద పిరమిడ్ ధ్యాన కేంద్రం

అనారోగ్య సమస్యలు వస్తాయి



మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నేను 20 ఏండ్ల నుంచి మాంసాహారం తీసుకోవడం మానేశా. మనిషి జీర్ణవ్యవస్థ శాకాహారానికి అనువుగా ఉంటుంది. మాంసం తీసుకుంటే జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. కూరగాయలు సులువుగా జీర్ణమవుతాయి. మా ఇంట్లో శుభకార్యాలు జరిగినప్పుడు కూడా కూరగాయల భోజనమే పెడతాం.

– బి.కృష్ణారెడ్డి, నల్లగొండ

40 సంవత్సరాలుగా శాకాహారం తీసుకుంటున్నా



నేను 40 ఏళ్లుగా శాకాహారాన్ని తీసుకుంటున్నాను. 80 శాతం ఆరోగ్య సమస్యలు మాంసాహారంతోనే వస్తాయి. కూరగాయలు తినడం వల్ల శరీరం తేలిగ్గా ఉంటుంది. శాకాహారం తీసుకున్నప్పటి నుంచి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాలేదు.

– కె.సువర్ణజైపాల్‌రెడ్డి, నల్లగొండ

కూరగాయల్లో పోషకాలు అధికం



మాంసాహారంలో ఉండే అన్ని పోషకాలు కూరగాయల్లో కూడా ఉంటాయి. ఈ మధ్య కాలంలో చాలా మంది స్కిన్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దానికి కారణం అతిగా మాంసం తీసుకోవడమే. నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటే మంచిది. శాకాహారం తీసుకోవడం ఎంతో లాభం.

– డాక్టర్ టి.హరికృష్ణ, జనరల్ ఫిజీషియన్

క్లుప్తంగా

నేడు 'సాక్షి' స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్ష

రామగిరి(నల్లగొండ): డ్యూక్స్ వాఫీ, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి సహకారంతో సాక్షి మీడియా ఆధ్వర్యంలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ 2వ రౌండ్ పరీక్షలు ఆదివారం ఉదయం 10 గంటలకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నిర్వహించనున్నారు. నల్లగొండలోని శివాజీనగర్‌లో గల ఏకలవ్య ఫౌండేషన్ స్కూల్‌లో, సూర్యాపేటలోని నెహ్రూనగర్‌లో గల జయ హైస్కూల్‌లో స్పెల్ బీ పరీక్షలు నిర్వహిస్తారు.

ఎంజీయూ అధికారులకు నూతన బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన అధికారులతో వీసీ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శనివారం పలువురు అధికారులకు నూతన బాధ్యతలు అప్పగిస్తూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాలు జారీచేశారు. మౌలిక వసతుల డైరెక్టర్‌గా ఆకుల రవి, స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా అన్నపూర్ణ ఆర్‌ఎస్ బుట్టి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా తిరుమల, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్‌గా చింత శ్యాంసుందర్‌ను నియమించి నియామక పత్రాలు అందజేశారు.

లాంచీలో ప్రయాణించిన కవులు అందెశ్రీ, వెంకన్న



అందెశ్రీ, వెంకన్నను సన్మానిస్తున్న విజయ్ విహార్ హోటల్ మేనేజర్ శ్రీనివాస్

పెద్దవూర: నాగార్జునసాగర్ నుంచి లాంచీలో శ్రీశైలం వెళ్లేందుకు గాను ప్రకృతి కవి అందెశ్రీతో పాటు మరో కవి వెంకన్న శనివారం సాగర్‌కు వచ్చారు. స్థానిక విజయ్ విహార్ హోటల్‌లో అల్పాహారం సేవించారు. హోటల్ మేనేజర్ మిట్టపల్లి శ్రీనివాస్ వారిని సత్కరించి జ్ఞాపికను అందించారు. అక్కడి నుంచి లాంచీ స్టేషన్‌కు చేరుకుని శ్రీశైలం బయల్దేరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. శనివారం చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాంపల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి(వయస్సు సుమారు 40 ఏళ్లు) విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



అభివాదం చేస్తున్న దామోదర రాజనర్సింహ, ఇతర నాయకులు



నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నల్లగొండ టౌన్: సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రాలే అమలు చేసుకోవాలని ఇచ్చిన తీర్పుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా వందన్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ అనేది జనాభా ప్రకారం మాదిగ, మాదిగ ఉప కులాలకు రావాల్సిన హక్కు అని అన్నారు. వర్గీకరణపై 2004లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి వాదనలు వినిపించాలని కోరగానే సుప్రీం కోర్టు వెళ్లామన్నారు. తమ వాదనలు విన్న కోర్టు వర్గీకరణను రాష్ట్రాలే చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పు వచ్చిన వెంటనే సీఎం అసెంబ్లీలో వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. వన్‌మెన్ కమిటీ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం వర్గీకరణను అమలు చేస్తుందన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. మాదిగ జాతి సంక్షేమం కోసం ఐక్యంగా వర్గీకరణను అమలు చేయించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ.. వర్గీకరణ ఉద్యమంలో 12 మంది అమరులయ్యారని వారి స్ఫూర్తితో వర్గీకరణను జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పొందాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీలోని మాదిగ ప్రజాప్రతినిధులమంతా కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమ్మేళనంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కాలె యాదయ్య, నాయకులు పిడమర్తి రవి, కాంపల్లి సత్తయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, కొండేటి మల్లయ్య, నాగారం అంజయ్య, బొర్ర సుధాకర్, శ్రీనివాస్, మల్లేష్, శ్రీరాములు, దున్న యాదగిరి, పున్న కైలాష్ పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకుంటాం

- ఎమ్మెల్యేలు గడ్డం వినోద్ కుమార్, కేఆర్ నాగరాజు

రామగిరి(నల్లగొండ) : ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నల్లగొండలో శనివారం జరిగిన మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాలలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, రాబోయే రోజుల్లో మాలలు ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. మాలల ఆత్మగౌరవం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాలల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. మాలలంతా ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు జిల్లా నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అడ్డుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. మాలలను ఏమార్చడం ఎవరితరం కాదన్నారు. వర్గీకరణను అడ్డుకుని తీరుతామన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల బహిరంగ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డీఈఓ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నల్లగొండ జిల్లా చైర్మన్ లకుమల్ల మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రవి, మేకల వెంకన్న, బూర్గుల వెంకటేశ్వర్లు, ఎర్రమళ్ల రాములు, చెరుకు రామ్‌చందర్, డాక్టర్ మంచాల లింగస్వామి, గోపోజు రమేష్, మంత్రి నర్సింహయ్య, చెన్నకేశవులు, గాజుల పున్నమ్మ, చింతపల్లి బాలకృష్ణ, అద్దంకి రవీందర్, సంద యాదగిరి, రొయ్య కిరణ్‌కుమార్, నామ చక్రవర్తి, అంగారాజు స్వర్ణలత, పెయ్యల గీత, ఎన్నమల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కుమార్, చిత్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు

ట్రాక్టర్ కేజీ వీల్స్ ఢీకొని రైతు మృతి



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

నకిరేకల్: బైక్‌పై వెళ్తున్న రైతును ట్రాక్టర్ కేజీ వీల్స్(దమ్ము చక్రాలు) ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో శుక్రవారం జరిగింది. శనివారం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిబండ గ్రామానికి చెందిన రైతు యానాల ప్రభాకర్‌రెడ్డి(52) శుక్రవారం మధ్యాహ్నం పని నిమిత్తం బైక్‌పై నకిరేకల్ పట్టణానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. అదే గ్రామానికి చెందిన బుడిగె లింగయ్య తన ట్రాక్టర్‌పై ఇనుప వీల్స్(దమ్ము చక్రాలు) తగిలించుకుని వాటిపై ఇనుప గొర్రును వెనుక వైపు కట్టి నకిరేకల్ వైపు వెళ్తున్నాడు. నెల్లిబండ శివారులోని మూలమలుపు వద్ద బైక్‌పై వస్తున్న ప్రభాకర్‌రెడ్డి తలకు ట్రాక్టర్ వెనుక కట్టిన గొర్రు తగలడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభాకర్‌రెడ్డిని స్థానికులు వెంటనే 108 వాహనంలో నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. నకిరేకల్ ఆస్పత్రిలో ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం సందర్శించి నివాళులర్పించారు.

ఇంట్లో చొరబడి బంగారం, వెండి అపహరణ

చండూరు: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మొగుదాల కవిత తాను ఉంటున్న ఇంటికి కొద్ది దూరంలో కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి కిరాణా దుకాణానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి వెనుక తలుపునకు ఉన్న బేడం తొలగించి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాలో దాచిన బంగారు నెక్లెస్, చైన్, రింగ్, చెవి కమ్మలు, బిస్కెట్ బంగారం సుమారుగా 25 తులాలు, 50 తులాల వెండి, రూ.70 వేలు కనిపించలేదు. బాధితురాలు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి సొంత బంధువులే చోరీ చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ మొదలుపెట్టారు. బాధితురాలితో ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడారో వివరాలు సేకరిస్తున్నారు.

సినీ ఫక్కీలో పశువుల తరలింపు

- డీసీఎంను పట్టుకున్న పోలీసులు



పట్టుబడిన డీసీఎంలోని పశువులు

మోతె: సినీ ఫక్కీలో డీసీఎంలో పశువులు తరలిస్తుండగా మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా తునికికి చెందిన బాలనాగు 14 పశువులను సంతలో కొనుగోలు చేసి వాటిని డీసీఎంలో ఎక్కించి వాటి పైన చెక్కలు పేర్చి కొబ్బరి బోండాల బస్తాలు వేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. మార్గమధ్యలో మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు డీసీఎంను ఆపి పరిశీలించగా.. పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన పశువులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. పశువులు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్తి వివాదంతో నిలిచిన దహన సంస్కారాలు

- శవపేటికలోనే వృద్ధుడి మృతదేహం
- పోలీసుల జోక్యంతో మూడు రోజులకు పూర్తయిన దహన సంస్కారాలు



బాలరాజు (ఫైల్)

మోత్కూరు : ఆస్తి వివాదంతో ఓ వృద్ధుడి మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించకుండా మూడు రోజులు శవపేటికలోనే ఉంచారు. చివరికి పోలీసులు జోక్యం చేసుకోవడంతో దహన సంస్కారాలు జరిగాయి. మోత్కూరు మండలం సందర్శాపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలయ్య(65) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య లింగమ్మ, కుమారులు నరేష్, సురేష్, కుమార్తెలు శోభ, సోని ఉన్నారు. బాలయ్య భార్య లింగమ్మ, ఆమె సోదరుడు కలిసి తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో గతంలో మూడెకరాల భూమి కొనుగోలు చేసి కొన్నిరోజుల తర్వాత అర ఎకరం భూమి విక్రయించారు. మిగిలిన భూమిలో లింగమ్మకు రావాల్సిన ఒక ఎకరం పది గుంటల భూమిని రాములు తన కుమార్తె లింగమ్మ పెద్ద కోడలు (నరేష్ భార్య అరుణ)కు పట్టా చేశాడు. దీంతో చిన్న కొడుకు సురేష్ తనకు కూడా భూమిలో వాటా రావాలని పంచాయితీ పెట్టాడు. ఈ వివాదం దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతోంది. గురువారం బాలయ్య మృతిచెందగా.. భూ వివాదం పరిష్కారం అయ్యేవరకు దహన సంస్కారాలు చేయవద్దని సురేష్ అడ్డుచెప్పాడు. ఈ సమాచారం తెలియడంతో ఎస్‌ఐ డి.నాగరాజు, సీఐ వెంకటేశ్వర్లు శనివారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి దహన సంస్కారాలు చేయించారు.

రేషన్ బియ్యం రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు నిందుతులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. దామరచర్ల మండలం బండావత్ తండాకు చెందిన బండావత్ సర్దార్ మండలంలోని రేషన్ లబ్ధిదారుల నుంచి సేకరించిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గత నెల 24వ తేదీన తెల్లవారుజామున గూడ్స్ ఆటోలో ఆంధ్రాకు తరలిస్తుండగా వాడపల్లి సమీపంలో ఆటో బోల్తా పడి ఆంధ్రాకు చెందిన నాగుల్‌మీరా అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసులో ఇప్పటికే రేషన్ బియ్యం దందా చేస్తున్న మందపాటి నరసింహారావు, కల్లూరి లింగయ్యను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న బండావత్ సర్దార్‌ను శనివారం అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రేషన్ బియ్యం దందా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా కారంపూడి మండలం చిన్న కొదమగుండ్ల గ్రామానికి చెందిన పల్లపు కామేశ్వర్‌రావు అశోక్ లేలాండ్ వాహనంలో 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో 15కు పైగా కేసులు నమోదయ్యాయని తెలిపారు. కాగా గతంలో అరెస్టయిన మందపాటి నరసింహారావు, కల్లూరి లింగయ్యపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్‌ఐ హరికృష్ణ తదితరులున్నారు.

కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



ఎన్యుమరేటరుకు తన కుటుంబ వివరాలు తెలియజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు: ఎంతో కాలంగా బీసీలు చేస్తున్న ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో తేలనున్న లెక్క ప్రకారం బీసీల రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన తన స్వగ్రామమైన నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కోతులారం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొని తన కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్‌కు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా బీసీల పోరాటం ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం కుల గణన చేపడుతుందన్నారు. ఇప్పటికే కులగణన రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం పూర్తయిందని, అతి త్వరలో మిగిలిన 10 శాతం పూర్తిచేసి బీసీ జనాభాకు తగినట్లుగా రిజర్వేషన్లు పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కుల గణనను నిలిపివేసేందుకు కొందరు అనేక ప్రయత్నాలు చేశారని ఆయన ఆరోపించారు. అలాంటి వారిని తిప్పికొట్టేందుకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు కులగణన చైతన్య యాత్రలు నిర్వహించామని గుర్తుచేశారు. సమగ్ర కుటుంబ సర్వే కోసం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసిన 90వేల మంది ఎన్యుమరేటర్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన కుటుంబ వివరాలు నమోదు చేసుకున్న ఎన్యుమరేటర్ సాయిశ్రీని ఆయన శాలువాతో సన్మానించారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ జాజుల పారిజాతసత్యనారయణ, జాజుల భాస్కర్ గౌడ్, కందుల లింగస్వామి, వెంకటేష్, యాదగిరి, కిరణ్ ఉన్నారు.

చెర్వుగట్టుపై మహిళ ఆత్మహత్యాయత్నం

- డయల్ 100కు ఫోన్ చేసిన ఆమె కుటుంబ సభ్యులు
- వెంటనే స్పందించి కాపాడిన నార్కట్‌పల్లి పోలీసులు



పోలీసుల అదుపులో కర్నాటి పద్మ

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టుపై ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా.. ఆమె కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని మహిళను కాపాడారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల కేంద్రానికి చెందిన కర్నాటి పద్మ, శ్రీశైలం భార్యాభర్తలు. కుటుంబ తగాదాలతో పద్మ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా పద్మ ఆచూకీ లభించలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. రాత్రి 10 గంటల సమయంలో పద్మకు మరోసారి ఫోన్ చేయగా.. ఆమె ఫోన్ ఎత్తి చెర్వుగట్టు దేవాలయం పైన ఉన్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 100కు కాల్ చేయగా.. నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ భూతరాజు రమేష్, హోంగార్డు రమేష్ వెంటనే చెర్వుగట్టు దేవాలయం వద్దకు చేరుకుని పద్మ ఆచూకీ తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న



సంజయ్ (ఫైల్)

గరిడేపల్లి: ఇంటి స్థలం విషయమై మాట్లాడుతుండగా.. మాటామాట పెరిగి తమ్ముడిని రోకలిబండతో కొట్టి అన్న హత్య చేశాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన నకిరేకంటి సంజయ్(26) ఇంటి స్థలం, వ్యవసాయ భూమి విషయమై శనివారం తన అన్న నకిరేకంటి అంజయ్య అలియాస్ అంజి, తండ్రితో మాట్లాడుతుండగా.. మాటామాట పెరిగి సంజయ్‌ను అన్న అంజయ్య రోకలి బండ, కర్రతో తలపై కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సంజయ్ గొంతు, భుజం, తలపై గాయాలు ఉన్నాయని అతడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రయాణికులకు బంపర్ ఆఫర్

- ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకుంటే ప్రత్యేక రాయితీలు
- శుభకార్యాలు, తీర్థయాత్రలకు వెళ్లేవారికి సదావకాశం



నల్లగొండ రీజియన్ నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులు

మిర్యాలగూడ టౌన్: నష్టాలను పూడ్చుకునేందుకు ఆర్టీసీ కొత్త కొత్త పథకాలకు శ్రీకారం చుడుతోంది. ఈ మేరకు వివాహ శుభకార్యాలు, విజ్ఞాన, విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లే వారు ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకుంటే 15 నుంచి 20శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు.

శబరిమలకు ప్రత్యేకం..

అయ్యప్ప మాలధారులు శబరిమలకు ఎక్కువగా తమ సొంత వాహనాలు, ట్రావెల్స్ బస్సులు, రైళ్లు, విమానాల్లో వెళ్తుంటారు. లక్షల్లో రద్దీ ఉంటుండటంతో శబరిమలతో పాటు మాలధారులు కోరుకున్న పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపించే విధంగా ఆర్టీసీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంటే వారితో పాటు ఇద్దరు వంటలు చేసే స్వాములు, ఇద్దరు మణికంఠ స్వాములు, ఒక అటెండర్‌కు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు. శబరిమలకు ఆర్టీసీ బస్సు బుకింగ్ చేసే గురుస్వామికి ఉచిత ప్రయాణంతో పాటు ఒకటి కంటే అంతకంటే ఎక్కువ సర్వీసులను అద్దెకు తీసుకునే సమయంలో అతడికి రూ.300 కమిషన్ కూడా ఇవ్వనున్నారు. గతంలో శబరిమలకు కిలో మీటరుకు రూ.65 అద్దె ఉండగా ప్రస్తుతం రూ.50 తగ్గించింది. కిలోమీటరు చార్జీతో పాటు టోల్ ఫీజులను కలుపుకొని నిర్ణయించారు. ఒక వేళ సమయం కంటే ఎక్కువ పెరిగితే గంటకు రూ.300 చొప్పున వసూలు చేయనున్నారు.

పంచరామాలకు ప్రత్యేక బస్సులు..

కార్తీక మాసంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి, దేవరకొండ, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ డిపోల నుంచి పంచరామ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులను నడిపిస్తున్నారు. ఆయా డిపోల నుంచి ద్రాక్షారామం(భీమేశ్వరాలయం), సామర్లకోట(కూమార రామ భీమేశ్వరస్వామి ఆలయ), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరస్వామి ఆలయం), భీమవరం (సోమేశ్వర ఆలయం), అమరావతి (అమరేశ్వర ఆలయం) వంటి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. పంచరామ పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఈ నెల 24వ తేదీ రాత్రి అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేవారు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రతి పౌర్ణమికి నల్లగొండ రీజినల్‌లో అన్ని డిపోల నుంచి అరుణాచలంకు కూడా ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపించనున్నారు.

ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. శుభకార్యాలు, విజ్ఞాన, విహార, తీర్థయాత్రలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. పంచరామ క్షేత్రానికి ఈ నెల 24వ తేది రాత్రి అన్ని డిపోల నుంచి రాత్రి 8 గంటలకు బస్సులు బయల్దేరుతాయి. ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకోవాలనుకునే వారు ఆయా డిపోలకు వెళ్లి టూర్ ప్యాకేజీ వివరాలు తెలుకోవచ్చు.

– ఎం. రాజశేఖర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్లగొండ